క్లుప్తంగా

దసరా ఏర్పాట్ల పరిశీలన



నల్లబెల్లి : మండల కేంద్రంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన దసరా ఏర్పాట్లను ఎస్సై గోవర్ధన్ మంగళవారం పరిశీలించారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నాగెల్లి శ్రీనివాస్‌తో చర్చించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు వైనాల వీరస్వామి, గోనెల నరహరి, బత్తిని మల్లయ్య, దామ సాంబయ్య, సామల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



సంగెం : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు వివిధ పార్టీల నుంచి బీజేపీలో మంగళవారం చేరారు. ఈ సందర్భంగా పల్లారుగూడ నుంచి డాక్టర్ నూనావత్ యాకూబ్, బానోత్ జగన్, సలేంద్ర శ్రవణ్ చారి, అనిల్ చారి, సారయ్య, వీరన్న, సుమన్ చారి, సునీల్, మొండ్రాయి నుంచి మామిండ్ల సంపత్, ఇమ్మడి పరమేశ్వర్, నల్లబెల్లి నుంచి మెరుగు శ్రీకాంత్, పెంతల నాగరాజు, రేఖ్యా నాయక్ తండా నుంచి భూక్య రాజు, బానోత్ రాజ్‌కుమార్, రాజు, వీరేందర్, మాలోత్ రాజేందర్, భూక్య వెంకట్, బానోత్ చరణ్, గుగులోత్ రాజ్‌కుమార్ తదితరులు చేరగా వారికి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారిని కాళీప్రసాద్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు దామెర్ప్పుల చంద్రమౌళి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు బుట్టి కుమారస్వామి, నాయకులు దేశినేని యాదగిరిరావు, దాసరి కుమారస్వామి, చంద్రమౌళి, దయ్యాల దేవరాజ్, దాసరి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీ షర్టుల పంపిణీ



నర్సంపేట : నెక్కొండ మండలంలోని గుండ్రపల్లికు చెందిన తన చిన్నమ్మ కుమారుడు నల్గొండ సురేశ్ ఇటీవల మృతి చెందగా ఆయన జ్ఞాపకార్థం చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటకు చెందిన డప్పు కళాకారులకు కాంగ్రెస్ పార్టీ స్థానిక మాజీ వార్డు సభ్యుడు కన్నం వెంకన్న మంగళవారం టీ షర్టులను పంపిణీ చేశారు. తొలుత సురేశ్‌కు నివాళులర్పించారు. అనంతరం 30 మంది కళాకారులకు టీ షర్టులు అందించారు.

ఎల్‌ఓసీ అందజేత



సంగెం : మండలంలోని వీఆర్ఎన్ తండాకు చెందిన గుగులోత్ భద్రమ్మకు మంజూరైన రూ.4 లక్షల ఎల్‌ఓసీని నాయకుడు గుగులోత్ అవినాశ్ మంగళవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. భద్రమ్మకు నిమ్స్ ఆస్పత్రిలో మోకాలి శస్త్రచికిత్స చేయించుకునేందుకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఎల్‌ఓసీ మంజూరు చేయించారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, భద్రు, నవీన్, వీరేందర్, రాందాస్, కిషన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి మంటలు

గీసుకొండ : మండలంలోని గట్టుకిందిపల్లిలోని తాటిచెట్లుపై మంగళవారం సాయంత్రం పిడుగు పడటంతో మంటలు లేచాయి. ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పిడుగు పడి తాటి మట్టలు కాలిపోయాయి. గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు.

బకాయిలు చెల్లించాలి

నల్లబెల్లి : గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య, లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకుడు గుగులోత్ రాము నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఐదు నెలలుగా వేతనాలు అందక వర్కర్లు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దసర నాటికైనా విడుదల చేయాలని కోరారు.

ఆదికర్మ యోగి అభియాన్ గ్రామాల ఎంపిక

కొత్తగూడ: ఆదికర్మ యోగి అభియాన్ కార్యక్రమాల నిర్వహణకు గ్రామాలను ఎంపిక చేసినట్లు తహసీల్దార్ రాజు తెలిపారు. స్థానిక క్రీడా పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడ, కొత్తపల్లి, జంగవానిగూడెం, సాధిరెడ్డిపల్లి, ముస్మి, గోవిందాపూర్, బత్తులపల్లి, గోపాలపూర్, కార్లాయి, తాటివారివేంపల్లి, ఈశ్వరగూడెం గ్రామాలు ఎంపికైనట్లు తెలిపారు.

పీహెచ్‌సీ ఉన్నతీకరణకు ఎదురుచూపు

● పడకలు సరిపోక అవస్థలు

దుగ్గొండి : మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సీహెచ్‌సీగా ఎప్పుడు ఉన్నతీకరిస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు. సుమారు 50 ఏళ్ల క్రితం ఏర్పాటైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో కేవలం 6 పడకలు మాత్రమే ఉండడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. సుమారు 5 దశాబ్దాలుగా కేవలం 6 పడకలతో 24 గంటల ఆస్పత్రిగా సేవలు అందిస్తున్నా ప్రభుత్వం సీహెచ్‌సీగా ఉన్నతీకరించడం లేదంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పీహెచ్‌సీ ద్వారా దుగ్గొండి మండలంలోని 42 వేల మందికి, నల్లబెల్లి మండల పరిధిలోని కొన్ని గ్రామాలకు చెందిన 12 వేల మందికి, ఆత్మకూరు మండల పరిధిలోని 8 వేల మందికి, సంగెం మండల పరిధిలోని 6 వేల మంది, చెన్నారావుపేట మండల పరిధిలోని 2 వేల 400 మందికి సేవలు అందుతున్నట్టు గణాంకాలు చెబుతున్నా ఉన్నతీకరణకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చొరవ చూపడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

30 పడకల ఆస్పత్రిగా ఉన్నతీకరణకు..

పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా ఉన్నతీకరణ కోసం 2015లో నాటి ఎంపీ సీతారాంనాయక్ ఆధ్వర్యంలోని వైద్యశాఖ అధికారులు పరిశీలించారు.



దుగ్గొండిలోని పీహెచ్‌సీ భవనం

సుమారు పదేళ్లు గడచినా ఉన్నతీకరణ ఆచరణకు నోచుకోకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నార్మల్ డెలివరీలు పెరుగుతుండగా బెడ్‌లు సరిపోని దుస్థితి నెలకొంది. ఇటీవల నర్సంపేటలో మెడికల్ కాలేజీ, జిల్లా ఆస్పత్రి, బోధనా ఆస్పత్రి అందుబాటులోకి రాగా ఇక్కడ నడుస్తున్న ఏరియా ఆస్పత్రిని దుగ్గొండిలోని పీహెచ్‌సీకి తరలించి సేవలందిస్తే మారుమూల పేదలకు మెరుగైన వైద్యం అందే అవకాశం ఉంది.

ఉన్నత శ్రేణి ఆస్పత్రులకు వెళ్లాలంటే ఇబ్బంది

దుగ్గొండి మండలంలోని రోగులు వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి వెళ్లాలంటే 35, నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రికి వెళ్లాలంటే సుమారు 30 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. అత్యవసర వైద్యం కోసం సుదూర ప్రాంతం వెళ్లలేని పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుండెజబ్బులు, జటిలమైన కాన్పుల కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుండడంతో కొందరు రోగులు మార్గమధ్యలోనే ప్రాణాలు వదులుతున్న దుస్థితి నెలకొంది. ఏరియా ఆస్పత్రి అందుబాటులో ఉంటే మెరుగైన వైద్యం అందుతుందని మండల పేదలు ఆశిస్తున్నారు. ఏరియా ఆస్పత్రిని దుగ్గొండికి తరలించి, దుగ్గొండి పీహెచ్‌సీని గిర్నిబావికి తరలించే దిశగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఏరియా ఆస్పత్రి ఏర్పాటు చేయాలి



దుగ్గొండిలో ఏరియా ఆస్పత్రి ఏర్పాటు చేస్తే రోగులకు సౌకర్యంగా ఉంటుంది. మెరుగైన వైద్యసేవలు అందే అవకాశం ఉంది. పేదలు వైద్యం కోసం పట్టణాలకు వెళ్లలేక మార్గమధ్యలోనే ప్రాణాలొదులుతున్నారు. ఏరియా ఆస్పత్రి ఏర్పాటుకు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే కృషి చేయాలి.

– బొట్ల నరేశ్, ప్రజాసంఘాల నాయకుడు

ఐక్యపోరాటాలతోనే సమస్యల పరిష్కారం

● యూనియన్ గౌరవ అధ్యక్షుడు రమేశ్

నర్సంపేట : ఐక్యపోరాటాలతోనే సమస్యలు పరిష్కారమౌతాయని ఐరన్, హార్డ్‌వేర్ అండ్ ప్లైవుడ్ వర్కర్ యూనియన్ (ఏఐసీటీయూ అనుబంధం) గౌరవ అధ్యక్షుడు పెద్దారపు రమేశ్ తెలిపారు. పట్టణంలో పాశం రాజిరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఐరన్, హార్డ్‌వేర్, ప్లైవుడ్ షాపుల కార్మికుల సంయుక్త సమావేశానికి రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉత్పత్తిలో కార్మికుల భూమిక కీలకమన్నారు. హక్కుల సాధనకు పోరాటాలు తప్పవని చెప్పారు. ఏఐసీటీయూ జిల్లా కోశాధికారి మాషుక్ మాట్లాడుతూ శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మికులకు యూనియన్ అండగా ఉంటుందన్నారు. అనంతరం నర్సంపేట ఐరన్, హార్డ్‌వేర్ అండ్ ప్లైవుడ్ వర్కర్స్ యూనియన్ కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా పెద్దారపు రమేశ్, అధ్యక్షుడిగా పాశం రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ముత్యాల భద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా కుడుతాల రాజు, కోశాధికారిగా సముద్రాల అశోక్, సహాయ కార్యదర్శిగా చింతల శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ సలహాదారులుగా మహ్మద్ మాషుక్, కార్యవర్గ సభ్యులుగా దూదె మల్లయ్య, మాదాటి మణి, రాసమల్ల కృష్ణమాచారి, పోతబోయిన శ్రావణ్, సంగెపు శ్రావణ్, వాసు, శ్రీను ఎన్నికయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

రిటైర్డ్ ఉద్యోగుల కమిటీ ఎన్నిక



నెక్కొండ : మాట్లాడుతున్న ఈశ్వరమూర్తి

నెక్కొండ : స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎన్నికల అధికారిగా నర్సంపేట యూనిట్ అధ్యక్షుడు ఈశ్వరమూర్తి, పరిశీలకుడుగా లక్ష్మారెడ్డి హాజరై కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా గటిక మల్లయ్య, గౌరవ అధ్యక్షుడుగా ఇనుగాల ఉపేందర్‌రెడ్డి, ముఖ్య సలహాదారుగా వడ్డె లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా మోహినొద్దీన్, కోశాధికారిగా కస్తూరి శ్రీహరి, సహ అధ్యక్షుడుగా మడత శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మెట్టు నర్సింహారెడ్డి, పొగాకుల సుభద్ర, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాదావతు రత్నయ్య, సంయుక్త కార్యదర్శిగా ఈదునూరి యాకయ్య, ప్రచార కార్యదర్శిగా వడ్డె పరమేశ్వర్ ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు మల్లయ్య మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

లాండ్రీ అసోసియేషన్ కమిటీ..

లాండ్రీ షాపుల అసోసియేషన్ పట్టణ కమిటీని మండల కేంద్రంలో గౌరవ అధ్యక్షుడు రామారపు వీరస్వామి ప్రకటించారు. అధ్యక్షుడిగా రామారపు రాము, ఉపాధ్యక్షులుగా రామారపు శ్రీమన్నారాయణ, రామారపు భద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా బండి నరేశ్, కోశాధికారిగా పొట్లపల్లి వీరస్వామి, కార్యదర్శులుగా పైండ్ల సురేశ్, రాయరాకుల సాంబయ్య, ఆడిటర్లుగా రామారపు విజేందర్, రామారపు విజయ్, ముఖ్య సలహాదారులుగా పైండ్ల కుమారస్వామి, మునుకుంట్ల వెంకన్న, సభ్యులుగా రామారపు రమ, రామారపు యాకమ్మ, పొట్లపల్లి భరత్ ఎన్నికయారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాము మాట్లాడారు. ప్రభుత్వం లాండ్రీ షాపులకు ఇస్త్రీ పెట్టెలు అందించాలని, ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు.



అధ్యక్షుడు రాము

'ఎస్ఆర్ఆర్' సహకారంతో ఆలయ అభివృద్ధి

రాయపర్తి : ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ సహకారంతో మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్ తెలిపారు. ఆ ఆలయ ప్రహరీ నిర్మాణం, సీసీ పనులను కుమార్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడారు. ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో పనులను చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు లేతాకుల రంగారెడ్డి, గజవెల్లి ప్రసాద్, యూసుఫ్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



ప్రహరీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కుమార్

డాక్టర్ సౌందరయ్య సేవలు మరువలేనివి

గీసుకొండ : వైద్యుడిగా, నాయకుడిగా డాక్టర్ సిరంగి సౌందరయ్య ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గట్టికొప్పుల రాంబాబు అన్నారు. మండల పరిధిలోని ధర్మారంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నాయకుడు సౌందరయ్య 24వ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌందరయ్య చిత్రపటానికి రాంబాబు, నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాంబాబు మాట్లాడారు. సౌందరయ్య అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేవైఎం ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు కైరికె రవికుమార్, జిల్లా కౌన్సిల్ మెంబర్ గోదాసి అశ్వినికుమార్, నాయకులు బిల్ల రమేశ్, జాలుగపు ప్రసన్న, రాంప్రసాద్, ల్యాదళ్ల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న రాంబాబు, తదితరులు

అన్నదానం

మండలంలోని ఊకల్ క్రాస్ రోడ్డులో బీజేపీ నాయకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు ముల్క ప్రసాద్, చొక్కం శ్రీనివాస్, జాన్ విక్రమ్, నల్ల సాంబరాజు, ఏడాకుల రాజిరెడ్డి, గడ్డమీది బాలరాజు, తిరుపతిరెడ్డి, ఆకుల వెంకన్న, బాదావత్ రమేశ్, బూర్గుల యుగేందర్, ఆరకట్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నర్సంపేట : పట్టణానికి చెందిన పుల్లూరి వెంకటయ్య ఇటీవల మృతి చెందగా ఆయన కుమారుడైన సీనియర్ జర్నలిస్టు పుల్లూరి శ్రీనివాస్ గౌడ్‌ను, బాధిత కుటుంబాన్ని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ నాయకులు మంగళవారం పరామర్శించారు. తొలుత వెంకటయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి గొడిశాల సదానందం, రాష్ట్ర కార్యదర్శి మద్దెల సాంబయ్య, జిల్లా కార్యదర్శి గోపగాని వెంకటేశ్వర్లు, జిల్లా సలహాదారు రామగోని సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శీలం వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

చంద్రయ్యపల్లిలో..

దుగ్గొండి : మండలంలోని చంద్రయ్యపల్లికి చెందిన యువ రైతు మొద్దు రాకేశ్ పిడుగుపాటుతో సోమవారం రాత్రి మృతి చెందగా బాధిత కుటుంబాన్ని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. తొలుత రాకేశ్ మృతదేహానికి నివాళులర్పించారు. అండగా ఉంటామని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. నాయకులు సుకినె రాజేశ్వర్‌రావు, పల్లాటి కేశవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, చుక్క రమేశ్, తదితరులు పరామర్శించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నామ స్మరణ



గీసుకొండ : మండలంలోని ఊకల్ నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో దీక్షా స్వాములు మంగళవారం రోజంతా 'ఓం నమో సుబ్రహ్మణ్యాం' అంటూ ఏకనామ స్మరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సుముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష స్వామి వారికి అభిషేకం, అర్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

వర్షానికి కూలిన ఇల్లు



పర్వతగిరి : మండల కేంద్రంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి నీలం యాకయ్యకు చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. అర్ధరాత్రి వేళ ఒక్కసారిగా ఇల్లు నేలమట్టమైందని బాధితులు మీడియా ఎదుట వాపోయారు. ఇంట్లో ఉన్న బియ్యం, ఇతర సామగ్రి ధ్వంసమైనట్టు తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని యాకయ్య కోరాడు.

నిరసన



నర్సంపేట రూరల్ : నర్సంపేట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషన్, వైద్యులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌దాస్, డాక్టర్ కిషన్ మాట్లాడారు. మహబూబాబాద్ మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌పై జరిగిన దాడిని ఖండించారు. కార్యక్రమంలో హెచ్ఓడీలు, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

నర్సంపేట : చెన్నారావుపేట మండల కేంద్రంలో నేడు (బుధవారం) బీఆర్ఎస్ మండల కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బాల్నె వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉదయం 8.30 గంటలకు మొదలవుతుందని తెలిపారు. పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటకు చెందిన ఆటో డ్రైవర్ నవీన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి మహాత్మాగాంధీ ఆటో యూనియన్ బాధ్యులు మంగళవారం రూ.18,600 నగదు సాయం చేశారు. తొలుత నవీన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పసునూరి వెంకన్న, నాయకులు సురేశ్, సత్యం, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు..

గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు మేకల చంద్రయ్య రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందగా మంగళవారం ఆయన అంత్యక్రియలకు బాధిత కుటుంబానికి స్థానికుడైన స్టేట్ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ రూ.5 వేల సాయం అందించారు. లక్ష్మీనారాయణ పంపిన నగదును సోషల్ సర్వీస్ టీమ్ సభ్యులు కర్ణకంటి రామ్మూర్తి, ముల్క సత్యనారాయణ, ఇనుముల ప్రభాకర్ అందజేశారు. తొలుత చంద్రయ్య మృతదేహానికి నివాళులర్పించారు.



నెక్కొండ : గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిస్తున్న దుర్గామాత

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



నల్లబెల్లిలో..



వర్ధన్నపేటలో..



సంగెంలో..

నర్సంపేట/నెక్కొండ/వర్ధన్నపేట/సంగెం: జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. చెన్నారావుపేట మండలంలోని ఎల్లయ్యగూడెంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవిని గాయత్రి దేవి రూపంలో, చెన్నారావుపేటలో శ్రీ సిద్దేశ్వర ఆలయ ఆవరణలో అన్నపూర్ణదేవి రూపంలో అలంకరించారు. వర్ధన్నపేటలో దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో, నెక్కొండలోని రామలింగేశ్వరాలయంలో అమ్మవారు గాయత్రీదేవి రూపంలో దర్శనమిచ్చారు. సంగెం మండలంలోని సంగెం, గవిచర్ల, లోహిత, కాట్రపల్లి, రామచంద్రపురం, తీగరాజుపల్లి తదితర గ్రామాల్లో పూజలు నిర్వహించారు. సంగెంలోని శ్రీగంగాభవానీ సమేత సంఘమేశ్వర ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నల్లబెల్లిలో వాగ్దేవి కళా సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఉత్సవాల్లో అమ్మవారి విగ్రహాన్ని సంతానలక్ష్మి రూపంలో అలంకరించారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు లబ్ధి



నర్సంపేట : ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రాణాప్రతాప్‌రెడ్డి, నాయకులు

● బీజేపీ ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో పేదలకు లబ్ధి చేకూరుతోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షుడు తనుగుల అంబేడ్కర్ ఆధ్వర్యంలో పట్టణంలోని వరంగల్ రోడ్డులో ప్రధాని మోదీ చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. ప్రధాని అన్ని వర్గాల పేదలకు లబ్ధి చేకూర్చేలా జీఎస్టీని భారీగా తగ్గించారని చెప్పారు. పండుగల సందర్భంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నర్సింహరాములు, రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి గడ్డం ఆంజనేయులు, పార్లమెంటు కోకన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, జిల్లా నాయకుడు కూనమల్ల పృథ్వీ, బీజేవైఎం జిల్లా నాయకులు అచ్చ దయాకర్, జూలూరి మనీశ్, తదితరులు పాల్గొన్నారు.



నల్లబెల్లి : సమావేశంలో మాట్లాడుతున్న వినయ్

చారిత్రాత్మకం

నల్లబెల్లి : నిత్యావసర సరుకులపై జీఎస్టీ తగ్గింపు చారిత్రాత్మకమని బీజేపీ మండల అధ్యక్షుడు తడుక వినయ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ ధరలు, పన్నుల భారం తగ్గించి పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నారని చెప్పారు. సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నాగరాజు, ఉపాధ్యక్షుడు గుర్రపు నరేశ్, నాయకులు వల్లె పర్వతాలు, నాగిరెడ్డి, రాజిరెడ్డి, మురికి మనోహర్, ములుక రాజేశ్, ఓదెల అశోక్, నాగపురి సాగర్, గుగులోత్ రాందాస్, అశోక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

యువత చేతిలోనే దేశ భవిష్యత్

దామెర : యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఉందని స్థానిక ఒకేషనల్ జూనియర్ కళాశాల అధ్యాపకుడు జైపాల్ అన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా నాల్గో రోజు వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించే విధంగా యువత నైపుణ్యం పెంచుకోవాలన్నారు. ఎంచుకున్న లక్ష్యానికి చేరే వరకు పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమావేశానికి ముందు గ్రామంలోని దామేశ్వరాలయం, చెరువుకట్ట, గోశాల పరిసర ప్రాంతాల్లో వలంటీర్లు శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు మహేందర్, భిక్షం, తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ శిబిరంలో మాట్లాడుతున్న జైపాల్

అభివృద్ధికి సహకరించాలి

ఖిలా వరంగల్ : మండల పరిధిలోని ఖబ్రస్తాన్లు, ఈద్గాల అభివృద్ధికి సహకరించాలని తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఉమ్మడి జిల్లా చైర్మన్ జబ్బార్ కోరారు. నూతన తహసీల్దార్ ఇక్బాల్‌ను స్థానిక ముస్లిం ప్రతినిధులతోపాటు జబ్బార్ మంగళవారం కలిసి శాలువాతో సన్మానించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు కేడల జనార్దన్, మాజీ కార్పొరేటర్ పద్మ తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చాంద్ పాషా, మీర్జా హసన్ బేగ్ , సురేశ్, కిషన్, మాషుక్, సొసైటీ డైరెక్టర్ నర్సయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లు ఏర్పాటు చేయండి

గూడూరు : ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అనుబంధంగా బాలుర, బాలికల హాస్టళ్లు ఏర్పాటు చేయాలని డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వివేక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించి విద్యార్థుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కొందరికి మధ్యాహ్న భోజనం ఇబ్బంది అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి శాంతి కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు వీరభద్రం, కార్యదర్శి సాయికుమార్, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.